క్లుప్తంగా

రంజాన్‌ కిట్ల పంపిణీ



రంజాన్‌ కిట్లు అందజేస్తున్న అతిథులు

కడప కల్చరల్‌: పవిత్రమైన రంజాన్‌ మాసాన్ని పురస్కరించుకొని కడప నగరం అల్మాస్‌పేటలోని జామియా తుస్సాలిహత్‌ మదరసాలో కడప ఇస్లామిక్‌ వెల్ఫేర్‌ సొసైటీ ప్రతినిధులు పలువురికీ బియ్యం ప్యాకెట్లు, సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌ వక్ఫ్‌బోర్డు సభ్యులు మౌలానా దావూద్‌ బాక్వి సాహెబ్‌, ప్రముఖులు అఫ్సర్‌ఖాన్‌, సయ్యద్‌ అహ్మద్‌బాషా వారు మాట్లాడుతూ కడప ఇస్లామిక్‌ వెల్ఫేర్‌ సొసైటీ ద్వారా ఈ ఏడాది 215 మంది పేదలకు రేషన్‌ కిట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్‌ ఎఫ్‌ఎం ముక్తార్‌ అహ్మద్‌, మదరస ప్రిన్సిపల్‌, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్చక పురోహిత నగర నూతన కమిటీ



అర్చక పురోహిత బ్రాహ్మణ కమిటీ సభ్యులు

కడప కల్చరల్‌: ఆంధ్ర ప్రదేశ్‌ అర్చక పురోహిత బ్రాహ్మణ సమాఖ్య కడప నగర నూతన కమిటీని గౌరవాధ్యక్షుడిగా పసుపులేటి శంకర్‌, అధ్యక్షులుగా బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ, మూర్తిరాజు సత్యనారాయణశర్మలను ఎన్నుకున్నారు. స్థానిక మృత్యుంజయకుంట శివాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఈఓ శ్రీధర్‌ వారికి నియామకపత్రాలు అందజేశారు. వారితోపాటు కోశాధికారిగా నరసింహ బట్టర్‌, యువజన అధ్యక్షుడిగా కంభలూరు గౌతమ్‌శర్మ, అధికార ప్రతినిధులుగా చెన్నూరు నరసింహ, ఆలమూరు సురేష్‌శర్మ, ఆరయూర్‌ జగదీష్‌శర్మ, మచ్చా సాయికృష్ణ స్వామిలను ఎన్నుకున్నారు. కల్లూరి విజయనంద్‌ రెడ్డి పాల్గొన్నారు.

4న రాష్ట్ర బడ్జెట్‌పై సదస్సు

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఆర్‌సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 4న సదస్సు నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యదర్శి ఎస్‌.రవిశంకర్‌ రెడ్డి తెలిపారు. ఆర్‌సీపీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ రాయలసీమ అభివృద్ధి కూటమి ప్రభుత్వానికి పట్టడం లేదన్నారు. రాయలసీమ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించడం కోసం సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆర్‌సీపీ రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ప్రసాద్‌, విజయ్‌కుమార్‌ పాల్గొన్నారు.

పోరాటంతోనే ఆశాలకు న్యాయం



మాట్లాడుతున్న వేణుగోపాల్‌

కడప వైఎస్‌ఆర్‌ సర్కిల్‌: ఏఐటీయూసీ పోరాటాలతోనే ఆశా కార్యకర్తలకు న్యాయం జరిగిందని ఏపీ ఆశా వర్కర్స్‌ యూనియన్‌ రాష్ట్ర అధ్యక్షురాలు పి.సుభాషిణి, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు గుంటి వేణుగోపాల్‌, జిల్లా అధ్యక్షురాలు యు.మరియమ్మ పేర్కొన్నారు. ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడుతూ ఆశా కార్యకర్తలకు గ్రాట్యుటీ రూ. 1.50 లక్షల వరకు లబ్ధి చేకూర్చడం మంచిదే అన్నారు. పెరిగిన నిత్యావసర ధరలకు అనుగుణంగా ఆశాలకిచ్చే వేతనాలు సరిపడలేదని, కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ నెరవేర్చాలని డిమాండ్‌ చేశారు. ఉచితంగా రూ.10 లక్షల బీమా, హెల్త్‌ కార్డులు, ఈఎస్‌ఐ, పీఎఫ్‌ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో సి.అమ్ములు, తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో ఆటా-పాట



శిల్పారామంలో చిన్నారుల నృత్య ప్రదర్శన

కడప కల్చరల్‌: ఆదివారం ఆటవిడుపు కార్యక్రమంలో భాగంగా కడప శిల్పారామంలో స్థానిక ముద్ర డ్యాన్స్‌ అకాడమీ చిన్నారులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. సినీ గీతాలు, జానపద పాటలకు హుషారు గొలిపే నృత్యాలు చేసి అలరించారు. ఏఓ శివప్రసాద్‌రెడ్డి, సూపర్‌వైజర్‌ మధుసూదన్‌బాబు పాల్గొన్నారు.

కడప వన్‌టౌన్‌లో రెండు కేసులు నమోదు

కడప అర్బన్‌: కడప నగరంలోని వన్‌టౌన్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఆదివారం రెండు కేసులను నమోదు చేసినట్లు ఎస్‌ఐ అమర్‌నాథ్‌రెడ్డి తెలియజేశారు. కడప పాత బస్టాండ్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న సిద్దారెడ్డి నుంచి 13 క్వార్టర్‌ బాటిళ్ల మద్యంసీజ్‌ చేసి, అతన్ని అరెస్ట్‌ చేశారు. రాజారెడ్డి వీధికి చెందిన బోయ శ్రీనివాసరావు (46) గత నెల 20వ తేదీ నుంచి కనిపించడం లేదనీ అతని భార్య స్వాతిసుధ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చిన్నారులకు ఉత్తమ బోధన



శిక్షణ పొందుతున్న అంగన్వాడీ కార్యకర్తలు

కడప కోటిరెడ్డిసర్కిల్‌: జాతీయ విద్యా విధానం అమలులో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో చదువులకు కొత్త రూపు సంతరించుకోబోతోంది. అంగన్వాడీ కేంద్రాలు ప్రీ ప్రైమరీ స్కూళ్లుగా మారబోతున్నాయి. మూడేళ్ల నుంచి ఐదేళ్ల లోపు వయస్సుగల చిన్నారులకు ఆటపాటలతో కూడిన చదువులు అందించేలా జ్ఞానజ్యోతి పేరిట ప్రత్యేక కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా శిక్షణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయులు చిన్నారులకు మెరుగైన విద్య బోధించేందుకు అంగన్వాడీ కార్యకర్తలకు ఇప్పటికే మొదటి, రెండు విడతల్లో ఆరు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించారు. అంగన్వాడీ కేంద్రాలను ప్రాథమిక పాఠశాలలకు అనుసంధానం చేసి ఒకటి, రెండు తరగతులు జిల్లా వ్యాప్తంగా 2389 అంగన్వాడీ కేంద్రాలుండగా, వాటిలో 102235మంది చిన్నారులకు బోధించే అభ్యాసన స్థాయిలపై అంగన్వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించాలన్నదే ముఖ్య ఉద్దేశ్యం.

ఆటపాటలతో తరగతులు

పూర్వ ప్రాథమిక పాఠశాలల్లో పిల్లలు అనేక కృత్యాల ద్వారా భవిష్యత్తులో వారు చదవబోయే విద్యకు సంబంధించిన బలమైన పునాదులు ఇక్కడే నిర్మించాలన్నదే ముఖ్య ఉద్దేశ్యం. వారు చదవడం, రాయడం, ఇతరులతో సంభాషించడం, బాషను అభివృద్ధి చేసుకుంటూ భావోద్వేగాలను అదుపు చేసుకుని తోటి బాలలతో కలిసిమెలిసి ఉండడం నేర్చుకునే విధంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ విద్యా విధానం పునర్నిర్మాణంలో పునాది దిశగా పేర్కొంటూ అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తోంది. ఇందులో భాగంగా వ్యూహాత్మక అనుకరణ, వివిధ రకాల ఆటలు, దుస్తులు ధరించడం, ప్రకృతి సందర్శన, శాస్త్రీయ జ్ఞానం, గణిత సంబంధిత ఆటలు, ఫజిల్స్‌, అక్షరాలు, సంఖ్యలను చిన్నారులు గుర్తు పట్టేలా బోధన చేసేలా కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమం అంగన్వాడీ కార్యకర్తలతోపాటు తల్లిదండ్రులు, సభ్యుల ప్రమేయంతో పిల్లల అభ్యాసన, ఎదుగుదల, అభివృద్ధిలో భాగస్వాములను చేసే విధంగా శిక్షణ ఇస్తున్నారు. బోధన నైపుణ్యాన్ని పెంపొందించే లక్ష్యంగా సర్టిఫికెట్‌ కోర్సులోభాగంగా 120 రోజులపాటు శిక్షణ ఇస్తున్నారు. దీంతో చిన్నారులకు ఉత్తమ బోధన అందనుంది.

వైఎస్సార్‌సీపీ హయాంలో పునాది

మాజీ సీఎం వైఎస్‌.జగన్‌మోహన్‌రెడ్డి చిన్నారుల అభివృద్ధికి తొలి ఆరేళ్ల వయస్సు చాలా కీలకం. దీనిని దృష్టిలో పెట్టుకుని మానసిక నిపుణుల సూచనల మేరకు ఎన్‌ఈపీలో ఈ వయస్సు వారికి ప్రాధాన్యం ఇచ్చారు. 0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లల కోసం ప్రత్యేకంగా నిర్వహించే అంగన్వాడీ కేంద్రాలే వారి భవిష్యత్తుకు దిక్సూచిగా నిలువాలనే లక్ష్యంతో జగన్‌మోహన్‌రెడ్డి హయాంలోనే బలమైన పునాదులు వేశారు. మన బడి నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించడంతోపాటు, ఆట వస్తువులతో చదువు నేర్పేందుకు నిధులు కేటాయించారు.

మెరుగైన ఫలితాల కోసం

జాతీయ విద్యా విధానానికి అనుగుణంగా అంగన్వాడీ ప్రీప్రైమరీ స్కూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాం. ఫౌండేషన్‌ లిటరసీ న్యూమరసి ప్రోగ్రామ్‌లో భాగంగా ఇప్పటికే శిక్షణ పొందిన ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలకు 120 రోజులపాటు సర్టిఫికెట్‌ కోర్సులో శిక్షణ ఇచ్చాం. శిక్షణ ద్వారా మెరుగైన ఫలితాలు వచ్చేలా ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం.

– శోభారాణి, సీడీపీఓ, కడప

ఎంతో ఉపయోగం

చిన్నారుల చదువులకు తొలి అడుగులు అంగన్వాడీ కేంద్రాల్లోనే పడతాయి. అక్కడి నుంచే పాఠశాలలు వస్తారు. అందువల్ల ప్రీ ప్రైమరీ స్థాయిలోనే నైపుణ్యతతో కూడిన చదువులు అందించేందుకు ఇటువంటి శిక్షణ ఎంతగానో ఉపయోగకరంగా ఉంటుంది. చిన్నారులకు ఆటపాటల ద్వారా విద్య అందించి వారి సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యం.

– రేణుక, సూపర్‌వైజర్‌, కడప

చోరీలపై ప్రజల్లో అప్రమత్తత అవసరం



చోరీలపై అప్రమత్తంగా ఉండడంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్‌ఐ

కమలాపురం : దొంగతనాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కమలాపురం సీఐ ఎస్‌కే రోషన్‌, ఎస్‌ఐ ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్‌ ఆదేశాల మేరకు, డీఎస్పీ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో పట్టణంలో ప్రజలకు దొంగతనాల పట్ల అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో తాళం వేసి వెళ్లిన ఇళ్లలో దొంగతనాలు అధికం అయ్యాయన్నారు. ముఖ్యంగా వేసవి కాలం కావడంతో చాలా మంది బయట నిద్రిస్తుంటారని, ఆ సమయంలో దొంగతనాలు జరిగే అవకాశం ఉందన్నారు. ప్రజలు విలువైన ఆభరణాలు, నగదు ఇళ్లల్లో ఉంచుకోకుండా బ్యాంకు లాకర్లలో భద్ర పరచుకోవాలని సూచించారు. అలాగే ఇళ్లకు తాళం వేసి ఊర్లకు వెళ్లే వారు సమీప పోలీస్‌ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలన్నారు. అలాంటి ఇళ్లపై పోలీస్‌ నిఘా ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే పోలీస్‌ శాఖ ఉచితంగా అందిస్తున్న ఎల్‌హెచ్‌ఎంఎస్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. పొలం పనులకు, వాకింగ్‌కు, పశువులు మేపు కోవడానికి వెళ్లే మహిళలు బంగారు ఆభరణాలు ధరించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఒక వేళ ఆభరణాలు ధరిస్తే అవి కనబడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అలాగే మీ కాలనీల్లో కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కమలాపురం ఎస్‌ఐ 91211 00532, సీఐ 91211 00529 నెంబర్లకు ఫోన్‌ చేయాలన్నారు. అలాగే స్థోమత ఉన్న వారు మీ ఇళ్లల్లో లేదా ఐదారు మంది కలసి వీధుల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. మీ వీధుల్లో ఎవైన సంఘటనలు జరిగితే సీసీ కెమెరాల ఫుటేజీ ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్‌ సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీకి అమ్ముడుపోయిన కౌన్సిలర్‌ పోసా

ప్రొద్దుటూరు : టీడీపీలో చేరిన వైఎస్సార్‌సీపీ 34వ వార్డు కౌన్సిలర్‌ పోసా వరలక్ష్మి భర్త పోసా భాస్కర్‌కు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి రాజకీయ, ప్రాణ భిక్ష పెట్టారని వైఎస్సార్‌సీపీ వార్డు నాయకులు తెలిపారు. వైఎస్సార్‌టీయూసీ పట్టణాధ్యక్షుడు ఖాజాపీర్‌ ఇంటి వద్ద ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ రెండుసార్లు కౌన్సిలర్‌గా ఎన్నికైన పోసా భాస్కర్‌, ఆయన సతీమణి వరలక్ష్మి ఇప్పటి వరకు కనీసం వాటర్‌ బాటిల్‌ కూడా ఎవరికీ కొనివ్వలేదన్నారు. తొలిసారి వార్డు కౌన్సిలర్‌ సీట్‌ జనరల్‌ కేటగిరికి కేటాయించగా రాచమల్లు అభిమానిగా తెరపైకి వచ్చిన పోసా భాస్కర్‌ ప్రాధేయపడి టికెట్‌ ఇప్పించుకున్నారన్నారు. ఆ ఎన్నికల్లో రాచమల్లు పోసాను గెలిపించడానికి రూ.50లక్షలు ఖర్చు చేయడంతోపాటు సమష్టిగా అందరితో పనిచేయించి గెలిపించారని గుర్తుచేశారు. రెండో సారి కౌన్సిలర్‌ ఎన్నికల్లో ఖాజీపీర్‌ సతీమణి నామినేషన్‌ వేయగా వారి కాళ్లు, చేతులు పట్టుకుని విత్‌డ్రా చేయించుకున్నారని పేర్కొన్నారు. సమాచారం కూడా ఇవ్వకుండా ఆయన టీడీపీ కండువా కప్పుకున్నారన్నారు. కౌన్సిలర్‌ స్థానానికి రాజీనామా చేసి మళ్లీ గెలవాలని పేర్కొన్నారు. రూ.15లక్షలు తీసుకుని టీడీపీలో చేరినట్లు తెలిసిందని తెలిపారు. టీడీపీ నాయకులకు పోసా దంపతులు అమ్ముడుపోయారని ఆరోపించారు. సమావేశంలో వైఎస్సార్‌టీయూసీ పట్టణాధ్యక్షుడు ఖాజాపీర్‌, ప్రొద్దుటూరు కోఆపరేటివ్‌ స్టోర్స్‌ అధ్యక్షురాలు గజ్జల కళావతి, మన్సూర్‌ ఇలాహి, చౌడం రవిచంద్ర పాల్గొన్నారు.

వైభవంగా గంగమ్మతల్లి తిరునాల



భక్తులకు మాంగల్య దర్శనం చేయిస్తున్న అర్చకుడు



కల్యాణాన్ని వీక్షిస్తున్నభక్తులు

చింతకొమ్మదిన్నె: మండలంలోని కొత్తపేట గంగమ్మ జాతర సందర్భంగా ఆదివారం గంగమ్మతల్లి, శివాంశ సంభూతుడైన కాటమరాజు కల్యాణాన్ని అర్చకులు రామకృష్ణ కన్నుల పండువగా జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ముత్యాల తలంబ్రాలను పంచిపెట్టారు. భక్తులు గంగమ్మతల్లికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. అనంతరం ఆలయ ఆవరణలో బంధుమిత్రులతో కలిసి విందుభోజనాల చేశారు. కోలాటాలు, చెక్కభజన తదితర సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గంగమ్మతల్లి అలయ ఆవరణం భక్తులతో కిటకిటలాడింది.

ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించాలి

సిద్దవటం : మండలంలోని టక్కోలు రైతు సేవా కేంద్రం పరిధిలోని దేగనవాండ్లపల్లి, ఖాజీపల్లె, కడపాయపల్లె, టక్కోలు గ్రామాలలో రైతుల సాగు చేసిన ప్రొద్దుతిరుగుడు, బెండ, వరి, కూరగాయలు, ఆకుకూరలు, నువ్వులు, అలసందలు వంటి పంటలను ఆదివారం పరిశీలించినట్లు బద్వేల్‌ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెండ సాగును పరిశీలించి ప్రకృతి వ్యవసాయ విధానాలు అవలంభించడం వల్ల రైతు నిమ్మకాయల ఓబులరెడ్డిని అభినందించామన్నారు. నీలం, పసుపు పల్లాలు కనీసం ఎకరాకు 20 చొప్పున అమర్చడం వల్ల రసం పీల్చు పురుగుల నివారించవచ్చన్నారు. ప్రొద్దు తిరుగుడులో శనగ పచ్చపురుగు, పొగాకు లద్దెపురుగు ఉధృతి నివారణకు స్పైనోసాడ్‌ అనే పురుగు మందును లీటర్‌ నీటికి 0.3 మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే నువ్వుల పంటలో బూడిద తెగులును గమనించామన్నారు. దీని నివారణకు హెక్సాకోనజోల్‌ లీటరు నీటికి 2 మిల్లీ లీటర్లు లేదా మైక్లో బుటానిల్‌ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని తెలియజేశారు

ఘనంగా రామకృష్ణ పరమహంస జయంతి

ప్రొద్దుటూరు కల్చరల్‌ : మండలంలోని కామనూరు శ్రీరామకృష్ణ సేవా సమితి కేంద్రంలో ఆదివారం శ్రీరామకృష్ణ పరమహంస 190వ జయంతిని ఘనంగా నిర్వహించారు. శ్రీరామకృష్ణ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలు చేశారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు రాఘవరెడ్డి మాట్లాడుతూ భగవాన్‌ శ్రీ రామకృష్ణ పరమహంస కలకత్తా సమీపంలో దక్షిణేశ్వర్‌ కాళికాలయంలో పూజారిగా చేరి, తన ఆధ్యాత్మిక సాధనలను మరింత పెంపొందించుకున్నారని తెలిపారు. రామకృష్ణ తన ఆధ్యాత్మిక బోధనలకు ఎంతో మంది యువతీ యువకులు ఆకర్షితులయ్యారన్నారు. స్వామి వివేకానంద కూడా ఆయన శిష్యుడేనని పేర్కొన్నారు. ఆయన బోధనలతో ఎంతో మంది ఆధ్యాత్మిక ఉత్తేజితులయ్యారని చెప్పారు. గ్రామంలో స్వామివారిని భజనలు చేస్తూ ఊరేగించారు. భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు. డాక్టర్‌ లక్ష్మీనరసయ్య, శివనాగిరెడ్డి, శ్రీకృష్ణారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా మల్లేశ్వరస్వామి కల్యాణం



బండలాగుడు పోటీలను తిలకిస్తున్న ఆకేపాటి, మేడా రఘునాథరెడ్డి

నందలూరు : మండలంలోని చింతకాయలపల్లె గ్రామంలో వెలసిన శ్రీ బోళా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి సందర్భంగా టంగుటూరు మాజీ సర్పంచ్‌ చింతకాయల గంగినాయుడు ఆధ్వర్యంలో శ్రీ కామాక్షి సమేత బోళా మల్లేశ్వరస్వామి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా జరిపించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను అత్యంత సుందరంగా ముస్తాబు చేసి కల్యాణ వేడుకను కనుల పండువగా జరిపించారు. ఈ కల్యాణోత్సవంలో రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌ రెడ్డి, రాజ్యసభ సభ్యులు (ఎంపీ) మేడా రఘునాథ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉత్కంఠగా బండలాగుడు పోటీలు

బోళా మల్లేశ్వరస్వామి మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా టంగుటూరు మాజీ సర్పంచ్‌ చింతకాయల గంగినాయుడు ఆధ్వర్యంలో ఆదివారం మధ్యాహ్నం బండలాగుడు పోటీలు నిర్వహించారు. ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్‌ రెడ్డి, రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి పోటీలను ప్రారంభించారు. పోతిరెడ్డిపల్లికి చెందిన త్యాగంరెడ్డి లింగారెడ్డి వృషభాలు మొదటిస్థానంలో నిలిచి రూ. 30 వేలు నగదు బహుమతిని రాజ్యసభ సభ్యులు మేడా రఘునాథ రెడ్డి చేతులమీదుగా అందుకున్నారు. ద్వితీయ స్థానంలో పోతిరెడ్డిపల్లికి చెందిన చాగంరెడ్డి నాగేశ్వర్‌ రెడ్డి వృషభాలు నిలిచి రూ. 20 వేలు, మూడోస్థానంలో తాళ్లపాక గ్రామానికి చెందిన రేనాటి సాంబశివరాజు వృషభాలు రూ. 10 వేలు అందుకున్నారు. నాల్గో స్థానంలో పాత సంగటిపల్లికి చెందిన విశ్వనాథ రెడ్డి వృషభాలు రూ. 5 వేలు అందుక్నునారు. ఐదో స్థానంలో గుడిపాడు తుమ్మల నారాయణ రెడ్డి వృషబాలు నిలిచి రూ. 3 వేలు అందుక్నునారు.

జిల్లా అర్చక సహ ప్రముఖ్‌గా విజయ్‌భట్టర్‌



విజయ భట్టర్‌ను అభినందిస్తున్న వీహెచ్‌పీ నేతలు

కడప కల్చరల్‌: వైఎస్సార్‌ జిల్లా మందిర అర్చక పురోహిత సహ ప్రముఖ్‌గా కడప గడ్డిబజారు లక్ష్మీసత్యనారాయణస్వామి ఆలయ ప్రధాన అర్చకులు విజయభట్టర్‌ నియమితులయ్యారు. నంద్యాల భరతమాత ఆలయ ప్రాంగణంలోని పుల్లారెడ్డి భవనంలో విశ్వహిందూ పరిషత్‌ దక్షిణాంధ్ర ప్రాంత సమావేశంలో ఆయనను ఎన్నుకున్నారు. ప్రసార ప్రచార సహ ప్రముఖ్‌గా సమ్మిరెడ్డి కృష్ణారెడ్డి, భజరంగదళ్‌ సహ సంయోజకులుగా నాగిరెడ్డి, మహేశ్వరరెడ్డి, దివాకర్‌, ప్రాంత దుర్గా వాహిని సంయోజిగా ముమ్మడి మేఘనారెడ్డి, జిల్లా సత్సంగ సహ ప్రముఖ్‌లుగా క్రిష్టిపాటి చిన్న బసిరెడ్డి, శ్రీధర్‌, జిల్లా సహ కార్యదర్శులుగా విశ్వనాథరెడ్డి, త్రివిక్రమ్‌లను నియమించారు. ఈ కార్యక్రమంలో నందారపు చెన్న కృష్ణారెడ్డి, కొండపల్లి వెంకట సుభాష్‌కుమార్‌, వెంకట్రామిరెడ్డి, మాలినీరెడ్డి, మనోహర్‌ రెడ్డి, రమణరావు, రామమహేష్‌, అమర్నాథ్‌ శెట్టి చంటి, సంజీవరాజు , సురేంద్రలు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవతోనే ఆత్మసంతృప్తి



స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో అతిథులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌: సమాజ సేవ అంటే బాధ్యత మాత్రమే కాదని, ఆత్మ సంతృప్తి కలుగుతుందని స్నేహ ఫౌండేషన్‌ ప్రతినిధి ప్రసన్న తెలిపారు. స్థానిక ఐటీఐ సర్కిల్‌ వద్ద గల బాలాజీనగర్‌లో ఆదివారం జేబీవీఎస్‌ ది ప్రిజర్వర్‌ సేవా సమితి రెండో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో యువతీ యువకులు స్వచ్ఛందంగా మంచి పనులకు శ్రీకారం చుట్టారాన్నరు. ఎన్‌ఎస్‌ఎస్‌ వలంటీర్‌ అశోక్‌ మాట్లాడుతూ సంస్థలో నిర్వహిస్తున్న ప్రాజెక్ట్‌ అన్నమిత్ర, ఔషధ సమర్పణ, పశుపర చర్య, పర్యావరణ, ఆలంబన, కిమద్రల గురించి వివరించారు. అనంతరం స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులకు మెమొంటోలు అందజేశారు.సంస్థ సభ్యులు, వలంటీర్లు పాల్గొన్నారు.

లైసెన్సు లేకుండా నడిపితే రూ.5వేల జరిమానా



మాట్లాడుతున్న కడప ట్రాఫిక్‌ సీఐ జావేద్‌

కడప అర్బన్‌: వాహన చోదకులు లైసెన్సు లేకుండా నడిపితే రూ.5 వేల జరిమానా విధిస్తామని ట్రాఫిక్‌ సీఐ జావెద్‌ అన్నారు. నగరంలోని రైతు బజార్‌ సర్కిల్‌ వద్ద ఆదివారం మోటారు వాహన చట్టంపై ఆదివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మద్యం తాగి వాహనం నడిపితే రూ.10 వేలు, హెల్మెట్‌ లేకుండా నడిపితే రూ.1000 జరిమానా, మూడు నెలలపాటు లైసెన్సు రద్దు జరగుతుందని పేర్కొన్నారు. అతివేగంగా నడిపితే రూ.1000, తొలిసారి సెల్‌ఫోన్‌ డ్రైవింగ్‌ చేస్తే రూ.1500, రెండోసారి డ్రైవింగ్‌ చేసి పట్టుబడితే రూ.10 వేలు జరిమానా విధించవచ్చన్నారు. యూనిఫాం లేకుండా ఆటో నడిపితే రూ.150, రెండోసారి ఆటో నడిపితే రూ. 300 జరిమానా విధిస్తారన్నారు. ఇన్సూరెన్స్‌ లేకుండా వాహనం నడిపితే రూ.2 వేలు, రెండోసారి రూ.4వేల జరిమానా విధించవచ్చునన్నారు. సీటు బెల్ట్‌ పెట్టుకోకుండా వాహనం నడిపితే రూ.1000 జరిమానా విధిస్తామని వివరించారు.

ప్రతి ముస్లిం ధాన, ధర్మాలు చేయాలి



ఇస్తార్‌ విందులో డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, ఫరూక్‌, తదితరులు

కడప ఎడ్యుకేషన్‌: అత్యంత పవిత్రమైన మాసంలో ప్రతి ముస్లిం తమ వంతుగా దానధర్మాలు చేస్తారని మాజీ డిప్యూటీ సీఎం ఎస్‌బి. అంజద్‌బాషా పేర్కొన్నారు. కడప అమన్‌ చారిటబుల్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్‌ విందు ఇచ్చారు. సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్‌ ఎస్‌ఎఎస్‌.ఫరూక్‌ మాట్లాడుతూ రంజాన్‌ మాసంలో ప్రతి ముస్లిం తన వంతు జకాత్‌ను పేదవారికి ఇవ్వాల్సి ఉందన్నారు. ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో 2008 నుంచి ఇప్పటి వరకూ జకాత్‌ ద్వారా నిరుపేద విద్యార్థులకు చేయూత ఇస్తున్నామన్నారు. అంజద్‌బాషా మాట్లాడుతూ ఎక్కువ మంది పేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సహకరించడం సంస్థ గొప్పదనమన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు అమీర్‌బాబు, మన్సూర్‌ అలీఖాన్‌, ఆస్మతుల్లా, ఇలియాస్‌ బాషా, నజీర్‌బాషా, ఎఫ్‌ఎంఎస్‌.ఖాదర్‌, డాక్టర్‌ గౌస్‌పీర్‌, డాక్టర్‌ నసీముద్దీన్‌, శామీర్‌, అన్నవరం బాషా, సభ్యులు పాల్గొన్నారు.

చిన్ననాటి నుంచే పిల్లల్లో దైవభక్తి



భక్తి గేయాలు ఆలపిస్తున్న చిన్నారులు

కడప కోటిరెడ్డిసర్కిల్‌: చిన్నప్పటి నుంచే పిల్లలో దైవభక్తి ఉండాలని దైవ సేవకులు చిట్టి శామ్యూల్‌, లాజరస్‌, ఎలీసా రామయ్య, దేవరాజు పిలుపునిచ్చారు. స్థానిక రెడ్డి కాలనీలోని హెబ్రోన్‌ ప్రార్థనా మందిరం నుంచి చిన్నారులతో కలిసి ఆదివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారులు ఏసు ప్రభువు జీవిత విశేషాలు తెలుసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు పలు పరీక్షలు నిర్వహించి ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎలీసా బాబు, ప్రసాద్‌, శంషోను, రమేష్‌, ఇజ్రాయిల్‌, హెబ్సీబా, రమణమ్మ, సునీత, మేరమ్మ, రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

మురుగు పరుగు



కడప ఓం శాంతిరోడ్డు నెంబరు-17లో మ్యాన్‌ హోల్‌ నుంచి మురుగు ఇలా ప్రవహిస్తున్నా పట్టించుకునే వారే కరవయ్యారు. రోడ్డుపై మురుగు ప్రహిస్తున్న కారణంగా దోమలు స్వైర్య విహారం చేస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్‌ అధికారులు సమస్యను పరిష్కరించాలని కోరారు.

– కడప కోటిరెడ్డిసర్కిల్‌

పన్ను చెల్లింపుదారుల సంఖ్య పెరగాలి

రాష్ట్ర ఆడిటర్స్‌ నేత షరీఫ్‌ఖాన్‌

కడప కల్చరల్‌: రాష్ట్రంలో పన్ను చెల్లింపుదారుల సంఖ్య తెలంగాణ కంటే తక్కువ ఉందని, వారి సంఖ్య పెరగాలని ఏపీ ఆడిటర్స్‌ అసోసియేషన్‌ చీఫ్‌ అడ్వైజర్‌ పఠాన్‌ షరీఫ్‌ ఖాన్‌ కోరారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాల చీఫ్‌ ప్రిన్సిపల్‌ కమిషనర్‌ మిథాలి మధుస్మిత, చీఫ్‌ కమిషనర్‌ సురేష్‌ బత్తిని, ప్రిన్సిపల్‌ కమిషనర్‌ సునీత బిల్లా, అడిషనల్‌ కమిషనర్‌ శ్రీధర్‌ను ఆయన ఆదివారం కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆయనపన్ను చెల్లింపుదారులు తమ ఆదాయాన్ని పెంచుకోవడంతోపాటు పన్ను చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం అధికారిణి మధుస్మిత మాట్లాడుతూ సకాలంలో ఆదాయపు పన్ను చెల్లించి రాష్ట్ర, దేశాభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పన్ను ఎగవేతదారుల ఎక్కువయ్యారని, తమ వ్యాపారానికి తగ్గట్టుగా టాక్స్‌ చెల్లించడం లేదని పేర్కొన్నారు. పన్ను చెల్లింపుదారులు తమ బాధ్యతను గుర్తు చేసుకుని నిర్ణీత సమయంలో పన్ను చెల్లించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆడిటర్లు పాల్గొన్నారు.